సాక్షి విశాఖపట్నం

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



'కొలువు'దీరిన 'బొమ్మలు'

జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహాచలం దరి బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. IIలో



ఉన్నత చదువులకు ఊతం

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2024లో పాసైతే రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లే లెక్క. IIలో



పరిపాలన కేంద్రంగా వర్థిల్లాలి

విశాఖ పరిపాలన కేంద్రంగా వర్థిల్లాలని వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. IIలో

న్యూస్‌రీల్

డిసెంబర్ 9న ఏయూ పూర్వవిద్యార్థుల సమావేశం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సమావేశం డిసెంబర్ 9న జరగనుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరగనున్న వేవ్స్ 2023కి ముఖ్య అతిథిగా టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ హాజరుకానున్నారు. ఇప్పటికే పూర్వవిద్యార్థుల సంఘం ఆహ్వాన పత్రాలను పంపే ప్రక్రియను ప్రారంభించింది. విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వచ్చేందుకు వీలుగా ముందుగా ఆహ్వానాలు పంపుతున్నారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

మహారాణిపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు జరిగాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు యూనిట్–2 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పద్మలతను విశాఖలో జాతీయ రహదారి(ఎన్‌హెచ్–16) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లను అనకాపల్లి జిల్లా కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పలాస ఆర్డీవో టి.సీతారామ్మూర్తిని విశాఖ భూసేకరణ అధికారి(ఎల్‌ఏ)గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.జ్యోతి మాధవిని కాకినాడ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. బొబ్బిలి ఆర్డీవో పి.శేషశైలజను విశాఖలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సత్య పద్మ మద్దాలను కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. పరిశ్రమ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ టీఈఎం రాజాను ఏపీఐఐసీ(భూసేకరణ అధికారి)గా నియమించారు. నక్కపల్లి ఎస్‌ఏవోటీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.జి.వేణిని శ్రీకాకుళం జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ కె.భవానీని ఏఎస్సార్ జిల్లా డీఆర్వోగా నియమించారు.

రైళ్లు, బస్సులు ఫుల్

- దసరా స్పెషల్స్‌కు డిమాండ్
- అదనపు చార్జీలు లేకపోవడంతో ఆర్టీసీకి ఆదరణ
- 25 నుంచి తిరుగు ప్రయాణాలకు పెరగనున్న తాకిడి



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ప్రయాణికులతో కిటకిటలాడిన ద్వారకా బస్ స్టేషన్

సాక్షి, విశాఖపట్నం: దసరా పండగకు వెళ్లే వారితో రైళ్లు, బస్సులు రద్దీతో నడుస్తున్నాయి. ఈ పండగను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, రైల్వేలు స్పెషల్ బస్సులు, స్పెషల్ రైళ్లను నడుపుతున్నాయి. దాదాపు నాలుగైదు రోజుల నుంచి వీటిలో ప్రయాణికులు కిటకిటలాడుతూ కనిపిస్తున్నారు. ఈ దసరాకు రెగ్యులర్ సర్వీసులతో పాటు ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి సుమారు 500 స్పెషల్ బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసింది. విశాఖ వైపు వచ్చే వారి కోసం హైదరాబాద్ నుంచి 20, విజయవాడ నుంచి 10 బస్సులను నడుపుతున్నారు. ఇంకా వివిధ ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే వారి కోసం మరో 200 బస్సులను సమకూర్చారు. వీటితో పాటు రాజమండ్రి, అమలాపురం, కాకినాడల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ బస్సులతో పాటు స్పెషల్ బస్సులూ జనంతో రద్దీగా ఉంటున్నాయి. దసరా రోజుల్లో ఈ రీజియన్ నుంచి నడిచే బస్సుల్లో సగటున ఆక్యుపెన్సీ రేషియో 85 శాతం వరకు ఉంటోంది. శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నుంచి విశాఖకు ఐదు రెగ్యులర్, మరో ఐదు స్పెషల్స్, విజయవాడ నుంచి 15 రెగ్యులర్, 10 స్పెషల్స్, విశాఖ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు మరో 150 వరకు స్పెషల్స్ నడిపారు. ఆదివారం కాస్త రద్దీ తగ్గడంతో సుమారు 70 స్పెషల్స్‌ను తిప్పారు. సోమ, మంగళవారాల్లో ప్రయాణాలు తగ్గనున్నాయి. పండగ అయ్యాక 25 నుంచి మళ్లీ తిరుగు ప్రయాణాలు మొదలవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని 25 నుంచి 30వ తేదీ వరకు 200 వరకు స్పెషల్ బస్సులను నడపనున్నారు. వీటిని విశాఖ నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పంపించనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. ఈ బస్సులకు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారని తెలిపారు. మరోవైపు దసరా స్పెషల్స్‌కు కూడా సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. దీంతో మునుపటికి భిన్నంగా స్పెషల్ బస్సుల్లోనూ ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది.

రైళ్లు కిటకిట

ఇక దసరా ప్రయాణికులతో రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. విశాఖ నుంచి, విశాఖ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. రైల్వే శాఖ ఈ దసరాకు పది వరకు స్పెషల్స్‌ను నడుపుతోంది. ఇప్పటికే రోజూ నడిచే రెగ్యులర్ రైళ్లతో పాటు స్పెషల్స్ కూడా జనంతో కిక్కిరిసిపోతున్నాయి. రిజర్వేషన్ బోగీల్లోనూ సాధారణ టికెట్టు ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. దసరా పండగ తర్వాత తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లే వారు ఇప్పటికే రైళ్లలో రిజర్వేషన్లు చేయించుకున్నారు. దీంతో అనేక రైళ్లకు 'రిగ్రెట్' వస్తోంది.



రైలు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

• శాకంబరిగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కనకమహాలక్ష్మి విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ముందుగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. పూజ దాతలు, పట్టుచీరల స్పాన్సర్స్ లక్కీ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్వర్ణలక్ష్మి అలంకరణలో సోమవారం కనకమహాలక్ష్మి అమ్మవారు దర్శనమిస్తారని, 108 బంగారు పుష్పాలతో అలంకరిస్తామని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు.



భీమిలి మండలం కొత్తపేటలో అమ్మవారికి పండ్లతో అలంకరణ



చిప్పాడలో శాకంబరిదేవి అలంకరణలో అమ్మవారు



అగనంపూడిలో దుర్గాదేవి రూపంలో దుర్గాలమ్మ

పూర్ణామార్కెట్‌కు దసరా శోభ

పూజా సామగ్రి కొనుగోలుకు తరలి వచ్చిన ప్రజలు

జగదాంబ : పూర్ణామార్కెట్ దసరా శోభను సంతరించుకుంది. విజయదశమి సందర్భంగా నగర ప్రజలు పూర్ణామార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ లోపల, బయట పెద్ద ఎత్తున దుకాణాలే వెలిశాయి. దశమిని పురస్కరించుకుని పూల ధరలు ఆకాశాన్ని అంటాయి. వంద గ్రాముల పూలు రూ. 150 వరకు విక్రయించారు. దిష్టి దండల దుకాణాలు ఎక్కువగా వెలిశాయి. ఈసారి నిమ్మకాయల ధరలు ప్రియంగా మారాయి. పండ్లు, ఇతర సామగ్రి కాస్త అందుబాటులోనే ఉందని చెప్పాలి. పూజల నేపథ్యంలో కలగూర సరకులు బాగా అమ్ముడయ్యాయి. ఈ సందర్భంగా వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐలు భాస్కరరావు, జోగిరాజు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో పండగ వేళ అయినా పూర్ణామార్కెట్‌లో పెద్దగా రద్దీ గానీ, ట్రాఫిక్ సమస్య కానీ ఉత్పన్నం కాలేదు.



నిమ్మకాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

చేస్తున్న మంచిని ప్రజలకు చెబుదాం



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



దసరా సంబరాలకు హాజరైన మహిళలు, కార్యకర్తలు

- టీడీపీ, జనసేనలు మళ్లీ మోసగించేందుకు వస్తున్నాయి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ఘనంగా దసరా–దీపావళి వేడుకలు

గోపాలపట్నం: గతంలో హామీలిచ్చి మోసం చేసిన తెలుగుదేశం, జనసేనలు యాత్రల పేరిట మళ్లీ మోసగించడానికి వస్తున్నాయని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన దసరా–దీపావళి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత వేదికపై ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడారి ఆనంద్ కుమార్‌కు సంబంధించిన ఏవీ ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. విద్య, వైద్యం రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమమని, ఇంటి వద్దనే కార్పొరేట్ వైద్యం అందుతోందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 79,390 మంది అక్క చెల్లెమ్మలకు డ్వాక్రా వడ్డీ మాఫీ చేశారని గుర్తు చేశారు. వచ్చే జనవరిలో నాలుగో విడత రుణమాఫీ జరుగుతుందని వెల్లడించారు. జగనన్న కాలనీల్లో 19,380 మందికి ఇంటి స్థలాలను అందించారని, 4 వేల మందికి టిడ్కో ఇళ్లను త్వరలోనే అందిస్తామన్నారు. నియోజకవర్గంలో ఆరు హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయని, ఇప్పటికే కొన్ని ప్రారంభమైనట్లు చెప్పారు. మరో రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' అని వివరించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని కోరారు. ఈ నెల 26 నుంచి సామాజిక న్యాయ బస్సు యాత్ర ప్రారంభమవుతుందని, ప్రతీ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. బస్సు యాత్రలో ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

పశ్చిమ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలు నమ్మడం మానేశారన్నారు. నియోజకవర్గంలో గత రెండు సార్లు టీడీపీకి అవకాశం ఇచ్చారని, గెలిచిన ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉన్నారా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. పశ్చిమ పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలంతా సమష్టి పనిచేసి, వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకే తీసుకొచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కాపులను వాడుకున్నారు తప్పితే.. తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాపులకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో కాపు కల్యాణ మండపం మంజూరుకు కృషి చేసిన ఆడారి ఆనంద్‌కుమార్ వెంటే కాపులంతా ఉన్నారన్నారు. జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గానికి మానవత్వం ఉన్న నాయకుడిని సమన్వయకర్తగా నియమించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్ టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, రమా కుమారి, పేడాడ రమణికుమారి మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వార్డు నాయకులు వై.వి.సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఏఎంసీ వందేళ్ల వేడుకల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట: ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా నిర్వహించే వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదివారం పరిశీలించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న వేడుకలకు ముఖ్యఅతిథిగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఇతర ప్రముఖులు, కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవుల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఆంధ్రా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్, వైద్యాధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. నిర్దిష్ట సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్మిస్తున్న భవనాన్ని కూడా పరిశీలించారు.

అప్పన్న జమ్మివేట ఉత్సవం రేపు

- పూలతోట ముస్తాబు
- ఉత్సవంలో రామాలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న
- రేపు సాయంత్రం 6 గంటల వరకే దర్శనాలు



ముస్తాబైన అప్పన్న అధిష్టించే ప్రధాన మండపం

సింహాచలం: విజయదశమి పురస్కరించుకుని మంగళవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేష ఏర్పాట్లు జరుగుతున్నాయి. పూలతోటను ముస్తాబు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ, ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలను, రాతి ఫౌంటైన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సింహగిరి మెట్లమార్గం, పూలతోట, స్వామి తిరువీధి జరిగే అడవివరం పుర వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. గోపాలపట్నం పోలీసులు భద్రత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



వరదరాజస్వామి అలంకరణలో స్వామి

ఉత్సవం ఇలా..

వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకరణ చేసి మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో సింహగిరి నుంచి మెట్లమార్గంలో పల్లకీలో కొండదిగువకి తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని అధిష్టింపజేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజలు ప్రారంభిస్తారు. తొలుత పూలతోటలోని శమీవృక్షం వద్ద శమీపూజ నిర్వహిస్తారు. అనంతరం ఆ శమీ దళాలను స్వామి చెంతన ఉంచి పూజలు చేపడతారు. జమ్మివేట ఉత్సవం నిర్వహించి.. తదుపరి స్వామిని పుష్కరిణి మండపం వద్దకు తీసుకొస్తారు. అక్కడ అశ్వవాహనంపై అధిష్టిస్తారు. రాత్రి అడవివరంలో స్వామికి అశ్వవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. అర్ధరాత్రి సమయంలో స్వామిని కొండపైకి చేరుస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం సాయంత్రం 6 గంటల వరకే స్వామి దర్శనాలు లభిస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

13 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

బీచ్‌రోడ్డు: రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 13 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం వద్ద లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. వారి వద్ద 13 కిలోల లిక్విడ్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అరుణ్, అనీషా, భషీర్, ఖాదీర్‌లను గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ లిక్విడ్ గంజాయిని హైదరాబాద్ తరలించేందుకు సిద్ధం చేసినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు.

ఉన్నత చదువులకు ఊతం.!

- ఇంటర్‌లో ఫెయిలైన వారికి మరో అవకాశం
- రెగ్యులర్ లేదా ఓపెన్ కోర్సుల్లో చేరేలా అవగాహన
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది ఫెయిలైన విద్యార్థులు
- కాలేజీల్లో చేరితే రెగ్యులర్ విద్యార్థులతో సమానం
- ఫీజు చెల్లింపునకు ఈ నెల 30తో ముగుస్తున్న గడువు


చదువుల్లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై పాసైతే మార్కుల మెమోపై కంపార్ట్‌మెంట్ అని కాకుండా రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లుగానే గుర్తింపు ఇవ్వనున్నారు. తప్పిన వాటితో పాటు అన్ని సబ్జెక్టులు రాసినా, ఎక్కువ మార్కులు వచ్చిన వాటినే పరిగణనలోకి తీసుకుంటారు.

ఇంటర్మీడియెట్‌తోనే ఆగిపోకుండా విద్యార్థులను ఉన్నత చదువుల వైపు తీసుకురావాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిలైన వారు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీరందరితో వార్షిక పరీక్షలకు ఫీజు కట్టించే బాధ్యతలను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించారు. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ దీనిపై విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లతో ప్రతి రోజూ వెబెక్స్ ద్వారా సమీక్ష చేస్తూ, నూరు శాతం లక్ష్య సాధనకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

జిల్లా	కాలేజీలు	ఫెయిలైన విద్యార్థులు	ఫీజు చెల్లించిన వారు
విశాఖపట్నం	173	8,397	4,006
అనకాపల్లి	133	6,323	2,612
అల్లూరి	72	1,018	339
మొత్తం	378	15,738	6,957

ఫెయిలైనా మళ్లీ కాలేజీకి..

2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం తప్పిన విద్యార్థులు మళ్లీ కాలేజీల్లో చేరి, చదువుకోవచ్చు. ఇలా విశాఖలో 8,397 మంది, అనకాపల్లిలో 6,323 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,018 మంది విద్యార్థులు ఉన్నారు. కాలేజీల్లో అడ్మిషన్ తీసుకుంటే వారిని రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించి 'అమ్మఒడి'వంటి సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేస్తారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ నెల 30తో ముగియనున్న గడువు

2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గుర్తించిన 15,738 మందిలో శుక్రవారం నాటికి 6,947 మంది ఫీజు చెల్లించారు. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశం ఉన్నందున నూరు శాతం లక్ష్యం సాధించేలా దసరా సెలవుల్లో విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. వీటిపై సందేహాల నివృత్తికి విశాఖపట్నంలోని ఆర్ఐవో కార్యాలయం ఫోన్ నంబర్ 0891–2552854కు సంప్రదించేలా తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులను తిరిగి కాలేజీల్లో చేర్పించటం, లేదంటే పరీక్షలకు హాజరయ్యేలా ఫీజు చెల్లించడం బాధ్యతను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించాం. సచివాలయ స్థాయిలో జరిగిన డ్రాపవుట్స్ సర్వే ఆధారంగా గుర్తించిన విద్యార్థులందరితో తప్పనిసరిగా ఫీజు కట్టించుకోవాలి.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో,ఉమ్మడి విశాఖ జిల్లా

విద్యార్థులకు మంచి అవకాశం



ఫెయిలైన విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా గుర్తింపు ఇస్తున్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మా కాలేజీ పరిధిలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అధ్యాపకులను దీనిలో భాగస్వామ్యులను చేశాం.

–పి.ఉమారాణి, సీనియర్ ప్రిన్సిపాల్, భీమునిపట్నం

ఉత్సాహంగా తంబోలా

కొమ్మాది: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా తిమ్మాపురంలో గల వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చర్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఉత్సాహంగా తంబోలా సాగింది. క్లబ్ ప్రెసిడెంట్ కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో రినాల్ట్ ట్రైబర్ కారును సూర్యప్రకాష్ గెలుపొందగా, 55 ఇంచీల టీవీని కె.శివకుమార్ సొంతం చేసుకున్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాయల వెంకటరెడ్డి

'కొలువు'దీరిన 'బొమ్మలు'

సింహాచలం: ఏటా విజయదశమి నవరాత్రి ఉత్సవాల్లో బొమ్మలకొలువును ఏర్పాటు చేసి తమ ప్రత్యేకతను చాటుతున్నారు 98వవార్డు పరిధిలోని సింహాచలం దరి బాలాజీనగర్‌లో ఉంటున్న మూల ప్రసాద్, భారతి దంపతులు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతూ 21 ఏళ్లుగా బొమ్మలకొలువును విశేషంగా ఏర్పాటు చేస్తున్నారు. మూల ప్రసాద్ నగరంలోని ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తుండగా, ఆయన భార్య భారతి నగరంలో స్పెషల్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఈసారి బొమ్మల కొలువులో వివాహ వేడుక , సత్యనారాయణస్వామి వ్రతం, సంగీత్, సీమంతం వేడుక, కురుక్షేత్ర యుద్ధం, శ్రీగోకులం, రాజస్థాన్ సంప్రదాయం నమూనాలతో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. బొమ్మలకొలువును తిలకించేందుకు పెద్ద ఎత్తున కాలనీవాసులు తరలివస్తున్నారు. గతంలో వై.ఎస్. సంక్షేమ పథకాలు, పావురాలగుట్ట నమూనా, జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర, పాదయాత్ర తదితర నమూనాలను బొమ్మలకొలువుల్లో ఏర్పాటు చేసి అభినందనలు అందుకున్నారు.


ఏర్పాటుచేసిన బొమ్మలకొలువుతో స్పెషల్ మేజిస్ట్రేట్ భారతి ప్రసాద్ దంపతులు

రౌడీయిజంపై ఉక్కుపాదం

సీపీ రవిశంకర్

బీచ్‌రోడ్డు: నగరంలో రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి రవాణాను అడ్డుకోవాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రౌడీషీట్లు, గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రౌడీషీటర్ల ప్రతి కదలికను నిశితంగా పరిశీలించాలన్నారు. నగర ప్రశాంతతకు భంగం కలిగించే ఎటువంటి చర్యలనూ ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ కేసులు పరిశీలించి.. బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలను గుర్తించాలన్నారు. మత్తు పదార్థాలు, పేకాట, కోడిపందాలు, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించాలన్నారు. నిందితులను పట్టుకోవడానికి అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు, సిబ్బంది సంఖ్య పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

'విశాఖ పరిపాలన కేంద్రంగా వర్ధిల్లాలి'

సింధియా: విశాఖ పరిపాలన కేంద్రంగా వర్ధిల్లాలని, సుపరిపాలన ఫలితాలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుతో సింధియాలోని గురుద్వారా నానక్ దర్బార్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సిక్కు మతస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో లజపతిరాయ్ మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాలకు పరిపాలన కేంద్రం దగ్గరగా ఉంటే.. ఆయా ప్రాంతాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అవకాశముంటుందన్నారు. 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందాలని, రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గురుద్వారా కమిటీ ప్రత్యేక ప్రార్థనలు చేసింది. వైఎస్సార్ సీపీ నాయకుడు సనపల నారాయణస్వామి, గురుద్వారా కమిటీ అధ్యక్షుడు హరచరణజిత్‌సింగ్, బలవేంద్రసింగ్, సంయుక్త కార్యదర్శి బాల్చేవ్‌రాజ్, సభ్యులు సతేందర్‌సింగ్ సేతి, రాజేంద్రపాల్‌సింగ్, మంజీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జేఏసీ చైర్మన్ ప్రొ.లజపతిరాయ్

ఘనంగా బతుకమ్మ సంబరాలు


ఉక్కునగరంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

ఉక్కునగరం: తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఉక్కునగరంలో ఘనంగా జరిగాయి. సీ భవనంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎస్‌వీ స్వామి ముఖ్య అతిథిగా వాటర్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి కె.రవిశేఖర్, ఎస్.ఎం.ఎస్–1 విభాగాధిపతి పి. శ్రీనివాసరావులు ప్రత్యేక అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడే విధంగా బతుకమ్మ సంబరాలు జరగడం హర్షణీయమన్నారు. ప్రతీ ఏడాది ఈ విధంగా జరుపుకోవడం తెలంగాణ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమన్నారు. మహిళలు బతుకమ్మ పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎస్. కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జి. ఆనంద్, బి. వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, ఎస్.నర్సింగరావు, టి.ప్రభాకర్, రవికుమార, నర్సింహ, బానోత్ గణేష్, టి.కనకరాజు, ఉన్నతాధికారులు ఎస్. వీరేశం, పి. శంకర్, ఎ.శంకర్ పాల్గొన్నారు.

కన్న తండ్రి అమానుషం

- కూతుళ్లపై లైంగిక వేధింపులు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పెందుర్తి పోలీసులు

పెందుర్తి: కన్న కూతుళ్ల పైనే లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని పెందుర్తి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట సమీపంలోని బంటా కాలనీలో నివాసం ఉంటున్న పప్పు అప్పారావు మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్య, ఇద్దరు కుమార్తెలను(18), (16) వేధింపులకు గురిచేసేవాడు. ఆదివారం సాయంత్రం పూటుగా మద్యం సేవించిన అతడు కుమార్తెలను లైంగికంగా వేధించాడు. అతడి ఆగడాలను భరించలేక కుమార్తెలు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉద్యోగిపై యాజమాన్యం దాడి


బాధితుడు రమేష్


రమేష్ శరీరంపై గాయాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో కిడ్నాప్ కలకలం రేగింది. జీతం చెల్లించమని అడిగినందుకు కోపం పెంచుకుని కిడ్నాప్ చేసి చిత్ర హింసలకు గురిచేసిన ఘటన వెలుగుచూసింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షీలానగర్‌లో నివాసం ఉంటున్న రమేష్.. కై రాన్ కళాత్మిక (కాంక్రీట్)లో బిజినెస్ మేనేజర్‌గా ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. రమేష్‌కు వ్యాపార పనుల నిమిత్తం కారును కూడా కంపెనీ సమకూర్చింది. నాలుగు నెలల నుంచి కంపెనీ జీతం చెల్లించడం లేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రమేష్ నడుచుకుంటూ వెళ్తుండగా షీలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొందరు కారులో బలవంతంగా ఎక్కించుకొని తీసుకెళ్లారు. మారికవలస వద్ద కంపెనీ గెస్ట్‌హౌస్‌లో బంధించి, యాజమాన్యానికి చెందిన మౌనిక, కె.శశికాంత్, వంశీకృష్ణ, రాము తీవ్రంగా దాడికి పాల్పడ్డారు. చిత్రహింసలకు గురిచేస్తున్న సమయంలో వీడియో కూడా తీశారు. అతడి ఫోన్ కూడా తీసుకున్నారు. తన భర్త ఆచూకీ తెలియడం లేదని, యాజమాన్యంపై అనుమానం ఉందని రమేష్ భార్య శనివారం రాత్రి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి మారికవలసలో రమేష్ ఉన్నట్టు తెలుసుకున్నారు. అయితే రమేష్‌ను శనివారం రాత్రి 10 గంటల సమయంలో షీలానగర్ వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడి చేసిన మౌనిక, శశికాంత్, వంశీకృష్ణ, రాములను అదుపులో తీసుకున్నట్లు గాజువాక సీఐ ఎల్.భాస్కరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం


హేమలత (ఫైల్)


ప్రమాద స్థలంలో మృతురాలు

పీఎం పాలెం: ఎండాడ దిశ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గజపతినగం మండలం మరుపల్లికి గ్రామానికి చెందిన గేదెల హేమలత(32) ఇద్దరు పిల్లలతో కలిసి మధురవాడలో నివసిస్తోంది. భర్త రైల్వే ఉద్యోగి. నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూడటానికి వరుసకు సోదరుడైన యర్రా నారాయణరావుతో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి అదే రోడ్డులో విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వెనుక కూర్చున్న హేమలత తుళ్లి పడింది. తలకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. వాహనం నడుపుతున్న నారాయణరావుకు గాయాలయ్యాయి. గీతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.